కనక గణపతి స్ఫూర్తితో ఉద్యమిస్తాం

నివాళులర్పిస్తున్న టీఏజీఎస్ నాయకులు

ఎదులాపురం, జూన్ 17 : ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ కనక గణపతి స్ఫూర్తితో ఉద్యమిస్తామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని రణదివ్యనగర్‌లో కనక గణపతి 5వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏండ్ల పాటు ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు, నాయకులు శకుంతల, జమున, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్

ఎదులాపురం, జూన్ 17 : ఇచ్చోడ మండలంలోని గిరిజన పాఠశాల, కళాశాలలో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై ఐటీడీఏ పీవోతో పాటు న్యాయ నిపుణులతో నిజనిర్ధారణ కమిటీ వేయాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు నరేందర్, రాకేశ్ పాల్గొన్నారు.

కదిలి ఆలయంలో జడ్జి పూజలు

జిల్లా జడ్జిని సన్మానిస్తున్న పండితులు

దిలావర్‌పూర్, జూన్ 17 : మండలంలోని ప్రసిద్ధ దేవాలయమైన కదిలి పాపహరేశ్వర ఆలయంలో సోమవారం నిర్మల్ జిల్లా జడ్జి జోగినిపల్లి భవిష్య ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వెళ్లిన ఆమెకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని ప్రాచీన శివలింగాన్ని దర్శించుకొని అభిషేకం చేశారు. పక్కనే ఉన్న మాత అన్నపూర్ణదేవిని దర్శించుకొని కుంకుమార్చన నిర్వహించి తన మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించి శాలువాతో సన్మానించారు.

ఘనంగా భీమన్న జాతర

సోన్, జూన్ 17: సోన్ మండలం సాకెర గ్రామంలో భీమన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. గోదావరి నది జలాలతో భీమన్న గజాలను శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అందరిని చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అందుబాటులో సోయా విత్తనాలు

జైనథ్, జూన్ 17 : మండల కేంద్రంలోని సహకార సంఘంలో రైతులకు సరిపడ సోయా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవో గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జేఎస్ 335 అనే రకం సోయా 30 కిలో బస్తా రూ.2100 విక్రయించబడుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో సోయా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇంద్రవెల్లి, జూన్ 17: ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మారుతిగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగోరావ్ (58) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఎంపీ నగేశ్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కనక తుకారాం, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, ఎంపీటీసీ కోవ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ కనక హనుమంత్‌రావ్, నాయకులు ఉన్నారు.

భగవంత్‌రావ్ సేవలు మరువలేనివి

భగవంత్‌రావ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మడావి నాగోరావ్, గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, జూన్ 17: ఆదివాసీ నాయకుడు ఆత్రం భగవంత్‌రావ్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని టీఏజీఎస్ మండల కార్యదర్శి మడావి నాగోరావ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రగుట్ట గ్రామంలో భగవంత్‌రావ్, కనక గణపతి వర్ధంతి నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం సోనేరావ్, టేకం రాము, ఆత్రం వెంకట్‌రావ్, మడావి ముత్త, బారిక్‌రావ్ పాల్గొన్నారు.

గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

తాంసి(తలమడుగు), జూన్ 17: తలమడుగు మండలం లక్ష్మీపూర్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద పోలీస్, పశు వైద్య సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వీరమాత జీజాబాయి సేవలు చిరస్మరణీయం

జీజాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బౌద్ధాచార్యులు

ఖైంసా, జూన్ 17 : వీరమాత జీజాబాయి సేవలు చిరస్మరణీయమని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బౌద్ధాచార్యులు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. పట్టణంలోని బుద్ధవిహార్ ఏపీనగర్‌లో బీఎస్ఐ ఆధ్వర్యంలో సోమవారం జీజాబాయి వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాగరబాయి, అక్షయ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



కుభీర్: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బోథ్: ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పేదలు, బంధువులకు ఖుర్బానీ పంపిణీ
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు

బక్రీద్ త్యాగానికి ప్రతీకగా నిలుస్తున్నదని వక్తలు పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి, ఉదయమే ఈద్గా, మసీదుల వద్దకు చేరుకున్నారు. మత పెద్దలు మత సందేశం వినిపించారు. అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎదులాపురం, జూన్ 17 : ఆదిలాబాద్‌లోని ఈద్గా మైదానంలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం మున్సిపల్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం ఆయా ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గా మైదానంలో మత పెద్దల సమక్షంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎస్పీ గౌష్ ఆలం సాముహిక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ ఖుర్బానీ జరిపే సమయంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఎవరికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేలా పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు వివరించారు. రాజకీయ నాయకులు, ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మల్‌లో..

నిర్మల్ అర్బన్, జూన్ 17 : నిర్మల్‌లోని ఈద్గాం కాలనీలో ఈద్గా వద్ద అన్ని వార్డులకు చెందిన ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని స్వీట్లను పంచిపెట్టారు. ఈద్గా వద్ద ప్రార్థనలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలిరావడంతో ట్రాఫిక్, ఇతర అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేరడిగొండ మండలంలో..

నేరడిగొండ, జూన్ 17 : వడూర్, వాంకిడి, నేరడిగొండ, గ్రామాల్లోని ఈద్గాల వద్దకు ఊరేగింపుగా ముస్లింలు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ చదివి వినిపించారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బోథ్/ఇచ్చోడ/తాంసి/నార్నూర్/కుభీర్, జూన్ 17 : బోథ్, సోనాల, ఇచ్చోడ, సిరికొండ, తాంసి, తలమడుగు, భీంపూర్, నార్నూర్, గాదిగూడ, కుభీర్ మండలాల్లో ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మేకలను బలి ఇచ్చి కుర్బానీ చేశారు.

దిలావర్‌పూర్‌లో...

దిలావర్‌పూర్, జూన్ 17 : మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీల నాయకులు ఈద్గా వద్దకు వెళ్లి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, జడ్పీటీసీ తక్కల రమణరెడ్డి, సహకార సంఘం చైర్మన్ పీవీ రమణరెడ్డి, మాజీ ఎంపీపీ ఏలాల చిన్నరెడ్డి, నాయకులు అనిల్, అర్గుల రమణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఖైంసాలో..

ఖైంసా, జూన్ 17 : ఖైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో గల ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, పట్టణ సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

తానూర్ మండలంలో..

తానూర్, జూన్ 17 : తానూర్, కోలూర్, జవుల(బీ) ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ లోకం సందీప్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్, జూన్ 17: ఖానాపూర్‌లోని జమ, మహ్మదీయ, మదీన, యకూబ్, కుభా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ అంటేనే త్యాగాల పండుగని, గుర్తుగా ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయమని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ముస్లింలకు స్థానిక మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్ఐ లింబాద్రి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి, జూన్ 17: మండలంలోని కేస్లాగూడ, ముత్నూర్, శంకర్‌గూడ, హీరాపూర్, ఇంద్రవెల్లి, ధనోరా(బీ) గ్రామాల్లోని ముస్లింలు ఈద్గా, మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్నేహితులను ఇళ్లకు పిలుపించుకొని సేమియాలు తినిపించారు.

సోన్, జూన్ 17 : సోన్, న్యూవెల్మల్, బొప్పారం, జాప్రాపూర్, పాక్‌పట్ల, కూచన్‌పల్లి, గంజాల్, రత్నాపూర్‌కాండ్లీ గ్రామాల్లోని ముస్లింలు మసీదులోకి వెళ్లి ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సారంగాపూర్ మండలంలో..

సారంగాపూర్, జూన్ 17 : మండలంలోని జామ్, సారంగాపూర్, స్వర్ణ, బీరవెల్లి, చించోలి(బీ), అడెల్లి గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద మత పెద్దలు ఖురాన్‌పై ముస్లింలకు హితబోధన చేశారు. ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు.

ముథోల్, జూన్ 17 : ముథోల్‌లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ సోదరులకు ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్ఐ సాయిచరణ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మణచాంద, జూన్ 17: మండల కేంద్రంతో పాటు ముని పెల్లి గ్రామాల్లోని మసీద్, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ అడ్వాల పద్మ, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



తానూర్ : కోలూర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నిర్మల్ అర్బన్: బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

ఎదులాపురం, జూన్ 17 : విద్యుత్ బిల్లుల్లో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్‌లో గల ట్రాన్స్ కో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినియోగదారులు తమ విద్యుత్ బిల్లుల సమస్యలను అధికారులకు విన్నవించారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం జరిగినప్పటికీ జీరో బిల్లు రావడం లేదని, రావాల్సిన దానికంటే అధిక బిల్లులు వస్తున్నాయని అధికారులకు విన్నవించారు. అర్జీలను అందజేసి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఏవో శంకర్, జేఏవో అరుణ్‌కుమార్, జేఎలు రవికుమార్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఖానాపూర్: విద్యుత్ వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

ఖానాపూర్‌లో..

ఖానాపూర్, జూన్ 17 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని ఖానాపూర్ ఏడీఏ కెశేట్టి శ్రీనివాస్ సూచించారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కడెం: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఈ సుమన్‌కుమార్

కడెంలో..

కడెం, జూన్ 17: కడెంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వినియోగదారులు ఐదు ఫిర్యాదులు చేయగా, వాటిని పరిశీలించి తగిన రీతిలో పరిష్కరించినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ ఏఈ సుమన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ సబ్ ఇంజినీర్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆత్మీయ సన్మానం

ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బ్రాహ్మణ్ సమాజ్ సభ్యులు

ఎదులాపురం, జూన్ 17 : ప్రస్తుతం హిందువుల ఐక్యత ఎంతో అవసరమని, ఆ క్రమంలో బ్రాహ్మణుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేశ్ అన్నారు. ఆదివారం రాత్రి ఆదిలాబాద్ తిర్పెల్లిలోని రామాలయంలో బ్రాహ్మణ్‌సమాజ్ ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యేలను ఆత్మీయంగా సత్కరించారు. వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా ఇటీవల నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎంపీ, ఎమ్మెల్యేలను పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ్ సమాజ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు సంతోష్, విశ్వాస్, అభిలాష్ టంబేకర్, సమాజ్ సీనియర్లు, ప్రముఖులు, కార్యవర్గ సభ్యులు, అర్చన పురోహిత సంఘం ,గాయత్రీ మహిళా మండలి, బ్రాహ్మణ ప్రైవేట్ ఉద్యోగ, వ్యాపార, ప్రొఫెషనల్స్ సభ్యులు నరేశ్ జోషి, విద్యాసాగర్, రఘుజోషి, ఉమాకాంత్, ప్రవీణ్ శర్మ, మహేశ్ దండ నాయక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

తాంసి, జూన్ 17: మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ నగేశ్ అన్నారు. సోమవారం తాంసిలోని రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంపీని సన్మానించారు. కప్పర్ల గ్రామానికి డబల్ రోడ్డు సౌకర్యం కల్పించాలని జడ్పీటీసీ రాజు ఎంపీకి వివరించారు. దీంతో ఎంపీ సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు తాటిపల్లి రాజు, బ్రహ్మానందం, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు సదానందం, నాయకులు దుర్వ పరమేశ్, రాకేశ్, నారాయణ, అరుణ్ కుమార్, కారం దేవీదాస్, మల్లికార్జున్, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలిండియా స్థాయి ర్యాంకర్‌కు ఎమ్మెల్యే అభినందన

జయరాజ్‌ను అభినందిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 17: ఆలిండియా స్థాయి జేఈఈ (అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన విజయరాజ్‌ను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అభినందించారు. జన్నారం మండల వాసి, నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో పీజీ హెచ్ఎంగా పనిచేస్తున్న భూక్యా రాజునాయక్–రూప దంపతుల కుమారుడు విజయరాజ్ జేఈఈ ఆలిండియా స్థాయిలో 210 ర్యాంకు సాధించాడు. విజయరాజ్‌కు ముంబైలోని ఐఐటీ కాలేజ్‌లో సీటు రావడంతో ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కాంట్రాక్టర్ పెంచల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాండు, నాయకులు జాదవ్ ధన్‌రాజ్, రాథోడ్ సురేందర్, రమేశ్, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నీటి శుద్ధీకరణ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాక

లోకేశ్వరం, జూన్ 17 : లోకేశ్వరం మండలం కిష్టాపూర్ గ్రామంలో మంగళవారం నూతన నీటి శుద్ధీకరణ ప్లాంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రానున్నట్లు అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, బీజేపీ నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఇచ్చోడ, జూన్ 17 : మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇచ్చోడలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని బృందావన కాలనీకి చెందిన కుమ్ర నాందేవ్ (56) ఇచ్చోడలోలోని యూఆర్‌జేసీ బాయ్స్ కళాశాలలో మల్టీ పర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. నాలుగైదు నెలల నుంచి అతిగా మద్యం సేవిస్తూ వింతగా ప్రవర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో హాస్టల్ డైనింగ్ హాల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కుమ్ర చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

ఆయిల్ పామ్ అడ్వైజరి కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఎమ్మెల్యేకు నియామక పత్రం ఇస్తున్న అధికారిణి

ఉట్నూర్, జూన్ 17: ఆయిల్ పామ్ అడ్వైజరి కమిటీ సభ్యుడిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఖానాపూర్ ఉద్యానవన పట్టు పరిశ్రమశాఖ అధికారి మౌనిక మర్యాద పూర్వకంగా కలిసి నియామక పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు. జిల్లాలో రైతులకు అవగాహన కల్పించి పంట సాగుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం తనపై నమ్మకంతో సభ్యుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రీయానిక్ కంపెనీ ఏరియా మేనేజర్ మనోజ్ రెడ్డి, క్లస్టర్ ఆఫీసర్ దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం, జూన్ 17 : మావల సెక్షన్ పరిధిలో గల దస్నాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల చేయనున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మావల అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్ జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దస్నాపూర్, ధోబీకాలనీ, పిట్టలవాడ, ఖోజాకాలనీ, రాంనగర్, సుభాష్‌నగర్, ఎంప్లాయిస్‌కాలనీ, టైలర్స్‌కాలనీ, పోలీస్ కాలనీ ,గ్రీన్‌సిటీ, కేఆర్‌కేకాలనీ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

నిర్మల్ అర్బన్, జూన్ 17 : నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ ఏడీఈ పీ రవి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దత్తాత్రేయ నగర్, దివ్య నగర్, అయ్యప్ప టెంపుల్, శాస్త్రినగర్, ఏఎన్‌రెడ్డి కాలనీలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఎంపీని కలిసిన అధికారులు

ఎదులాపురం, జూన్ 17 : ఇటీవల ఎంపీగా గెలుపొందిన నగేశ్‌ను సోమవారం గిరిజన శాఖ డీడీ డాక్టర్ ఎం దిలీప్, మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న పనులు, విద్యాలయాలు, తదితర అంశాలపై చర్చించారు. ఆయన వెంట జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి ఉన్నారు.

కురిసిన భార్షీం.. ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ఇంద్రవెల్లిలో కురుస్తున్న వర్షం

ఇంద్రవెల్లి, జూన్ 17: ఇంద్రవెల్లి మండలంలోని సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. వానకాలం సీజన్‌లో పత్తి విత్తనాలు వ్యవసాయ భూమిలో వేసి ఇతర పంటలు సాగు చేసి వర్షాల కోసం ఎదురు చూసిన రైతులు భారీ వర్షం కురువడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై నుంచి వర్షపు నీరు పారింది. అంతేకాకుండా వ్యవసాయ భూమిల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో మండల రైతులు సంతోషంలో మునిగిపోయారు.

ఎస్పీ గౌష్ ఆలంకు సన్మానం

ఎస్పీ గౌష్‌ఆలంను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐలు

ఎదులాపురం, జూన్ 17 : పార్లమెంట్ ఎన్నికలు ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలంకు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ ద్వారా ప్రశంసా పత్రం అందించిన విషయం తెలిసిందే. సోమవారం వన్ టౌన్‌లో డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీ గౌష్ ఆలంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, అశోక్, సాయి నాథ్, తదితరులు